క్లుప్తంగా

వైఎస్సార్ వర్ధంతి నేడు



మద్దిలపాలెం: దివంగత ముఖ్య మంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి కార్య క్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఏపీసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో సన్నాహాలు చేశామన్నారు. పార్టీ కేడర్ అందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

గిరిజన వసతి గృహంలో వైద్య శిబిరం



విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–11లోని గిరిజన బాలికల వసతి గృహంలో ఎల్‌ఐసీ, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 10 మంది డాక్టర్ల బృందం విద్యార్థినులకు వివిధ రకాల వైద్య సేవలను అందించింది. చర్మవాధులు, రక్తహీనతతోపాటు పలు రకాల చికిత్సలు చేశారు. కేజీహెచ్ మాజీ ప్రొఫెసర్ వై.ఎస్.నరసింగరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో తరచూ రక్తహీనత ఎక్కువగా కనిపిస్తోందన్నారు. గిరిజన సంఘం విజ్ఞప్తి మేరకు రక్తహీనతను అధిగమించేందుకు వైద్య శిబిరం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎన్నికైన హెల్త్ ఎడ్యుకేటర్ల కార్యవర్గ సభ్యులు

మహారాణిపేట: విశాఖ జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఆదివారం విశాఖ జిల్లాలో హెల్త్ ఎడ్యుకేటర్ల ఆత్మీయ సమావేశం రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో పని చేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా పలాడ శివ ప్రసాద్ (తగరంపూడి పీహెచ్‌సీ), కార్యదర్శిగా సయ్యద్ బేగం (డీఎం హెచ్‌వో), కోశాధికారులుగా పి.సుబ్బలక్ష్మి, ఆర్.ఝాన్సీరాణి, ఉపాధ్యక్షుడిగా రామనాథం, జాయింట్ సెక్రటరీలుగా బి.మంగ, ఎస్.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక సభ్యులుగా డి.సత్యవతి, వి.రవి ఎన్నికయ్యారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



కార్యక్రమంలో పాల్గొన్న యాదవ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం: యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో యాదవ సామాజిక వర్గ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ప్రదానం చేశారు. 10వ తరగతిలో 594 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులకు, ఇంటర్మీడియట్‌లో 986 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులకు అవార్డులు, నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు యాదవ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు బొట్ట వెంకటరమణ, ప్రగఢా చిన్నారావు, యు.రాజారావు, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బెస్ట్ ప్లేయర్‌గా ఎంపికయ్యా..



మా స్కూల్‌లో చదువుతోపాటు క్రీడల్లో అందిస్తున్న పోత్సాహం చాలా బాగుంది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నేను బెస్ట్ ప్లేయర్‌గా ఎంపికయ్యాను. నాకు ఎంతో ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో క్రికెట్‌లో ఉన్నతంగా రాణించడానికి ఈ విజయాన్ని తొలిమెట్టుగా భావిస్తున్నాను.

– తేజా దుర్గారామ్, 9వ తరగతి

హ్యాండ్‌బాల్‌లో రాణిస్తున్నా ..



మా స్కూల్‌లో క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహం, పీఈటీ రత్నం మేడం సహకారంతో నేను స్టేట్ హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నాను. మా పాఠశాలలో నిర్వహించే పోటీల ద్వారా పొందిన స్ఫూర్తితోనే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ఇటీవల నిర్వహించిన త్రోబాల్ పోటీల్లో విన్నర్‌గా నిలిచి విద్యార్థినుల టీమ్ ద్వారా విజయం అందుకున్నాను.

– లక్ష్మి, 9వ తరగతి

క్రీడల్లో ప్రోత్సాహం మరువలేనిది



మా పాఠశాలలో క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహం మరవలేనిది. మా స్కూల్ నుంచి నేను గతంలో స్టేట్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యా ను. ఇటు చదువులోనూ, అటు క్రీడల్లోనూ రాణిస్తున్నాను. మా పీఈటీ రత్నం మేడం పోత్సాహంతో 7వ తరగతి నుంచే క్రీడ ల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నాను. ఇటీవల జరిగిన వాలీబాల్ క్రీడల్లో విజయం సాధించాను.

– లోకేష్, 10వ తరగతి

తొలి ప్రైజ్.. ఆనందాన్నిచ్చింది



ఇటీవల స్కూల్‌లో నిర్వహించిన క్రీడా పోటీల రన్నింగ్ రేస్‌లో విజయం సాధించాను. తొలిసారి క్రీడల్లో గెలిచి బహుమతి సాధించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. నాకు యోగా చేయాలనే ఆసక్తి ఉంది. అందుకు అనుగుణంగా మా పీఈటీ రత్నం మేడం పోత్సహిస్తున్నారు. భవిష్యత్‌లో యోగా, క్రీడల్లో రాణిస్తాను.

– ధనుశ్రీ, 6వ తరగతి

క్రీడా రత్నాలు

- క్రీడల్లో రాణిస్తున్న కేడీపీఎం స్కూల్ విద్యార్థులు
- 'నేషనల్ స్పోర్ట్స్ డే' పోటీల్లో సత్తా
- విజేతల్లో ఆనందం, విజయోత్సాహం
- స్కూల్ యాజమాన్యం, స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహం

ఎంవీపీకాలనీ: పాఠశాల చదువు ప్రతి విద్యార్థికి ఒక తియ్యని జ్ఞాపకం. ఆ స్థాయిలో లభించే ఏ చిన్న ప్రశంసైనా.. ప్రోత్సాహమైనా, గెలుపైనా ప్రతి విద్యార్థికి ఎంతో ప్రత్యేకం. అలాంటి అనుభూతినే ఈస్ట్ పాయింట్ కాలనీలోని కేడీపీఎం స్కూల్ విద్యార్థులు ఇటీవల ఆస్వాదించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో సత్తా చాటారు. స్కూల్ యాజమాన్యం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో వారికి నచ్చిన క్రీడలో విజేతలుగా నిలిచారు. తొలి విజయానందాన్ని ఆస్వాదించడంతోపాటు బహుమతులు గెలుచుకున్నారు.

10 ఏళ్లుగా.. నిర్విరామంగా...

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో 10 ఏళ్లుగా నిర్విరామంగా ఏటా పలు అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. నగరంలో అత్యధిక మంది విద్యనభ్యసిస్తున్న పాఠశాలల్లో కేడీపీఎం స్కూల్ ఒకటి కావడంతో విద్యార్థుల నుంచి ఈ పోటీలకు మంచి ఆదరణ ఉంటోంది. స్కూల్ హెచ్ఎం సుమతి బాయ్, పీఈటీ రత్నంల పర్యవేక్షణలో పలు స్వచ్ఛంద సంస్థలు ఈ పోటీలకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నాయి. ఈ ఏడాది క్రికెట్ (జూనియర్, సీనియర్), వాలీబాల్, రన్నింగ్, షెటిల్ తదితర పోటీలు, విద్యార్థుల కోసం త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ వంటి పోటీలు నిర్వహించారు. జూలై 11న ప్రారంభమైన ఈ పోటీలు ఆగస్టు 27 వరకు కొనసాగాయి. ఆగస్టు 29న మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవంలో విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ విజయం తమ క్రీడా స్ఫూర్తికి తొలిమెట్టు అంటూ విద్యార్థులు వారి ఆనందాన్ని ఇలా పంచుకున్నారు.



క్రీడలకు సహకారం అందించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన కేడీపీఎం స్కూల్ విద్యార్థుల విజయోత్సాహం

స్వచ్ఛంద సంస్థల సహకారం



కేడీపీఎం స్కూల్ యాజమాన్యం పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏటా క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. పోటీలకు అవసరమైన ఖర్చులతోపాటు బహుమతులను స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్నాయి. ఈ ఏడాది రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఈ పోటీలకు ఆర్థిక సాయం చేసింది. ఆయా పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లతోపాటు ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు కలిపి 110 బహుమతులను ఆ సంస్థ అందించింది. విద్యార్థులను చదువుతోపాటు వారి ఆసక్తికి తగ్గ క్రీడల్లోను ప్రోత్సహించాలన్నదే ఈ క్రీడా పోటీల ప్రదాన ఉద్దేశం.

– రత్నం, ఫిజికల్ ట్రైనింగ్ టీచర్

గురుకులంలో విరిగిన కిటికీలు



శ్రీకృష్ణాపురం గురుకులంలో విరిగిన కిటికీల తలుపులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థుల వసతి భవనం కిటికీలు విరిగిపోయాయి. ఇక్కడ ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 520 మంది విద్యార్థులున్నారు. వీరికి ప్రత్యేకంగా వసతి గృహం ఉంది. ఈ పాత భవనంలో విద్యార్థులు ఉండే గదుల కిటికీలు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని కిటికీలకు తలుపులు పూర్తిగా లేవు. మరికొన్నింటి తలుపులు సగానికి విరిగిపోయాయి. తలుపులు విరిగిన కిటికీల నుంచి గదుల లోపలికి దోమలు చేరుతున్నాయని విద్యార్థులు అంటున్నారు. ఈ భవనంలో మరమ్మతులు చేపట్టి కిటికీలకు తలుపులు అమర్చాలని విద్యార్థులు కోరుతున్నారు. విరిగిన కిటికీలు, ఇక్కడ చేపట్టాల్సిన మరమ్మతుల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. విరిగిన కిటికీలకు తలుపులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఆరిలోవ సీఐకి బదిలీ



సీఐ గోవిందరావు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ) గంగుల గోవిందరావుకు బదిలీ జరిగింది. నగర పోలీస్ కమిషనర్ శనివారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం గోవిందరావును వీఆర్ రేంజ్‌కు సరెండర్ చేశారు. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా డీసీఆర్‌బీ నుంచి హెచ్.మల్లేశ్వరరావును ఆరిలోవకు బదిలీ చేశారు. ఆయన ఒకటి, రెండు రోజుల్లో ఇక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ ఏడాది జనవరి 30న గాజువాక నుంచి గోవిందరావు ఆరిలోవకు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి 7 నెలల పాటు పనిచేసిన అనంతరం ఆయనకు బదిలీ జరిగింది.

విమ్స్ ప్రధాన ద్వారాల వద్ద నిఘా కరువు

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేషెంట్లు, సిబ్బంది విజ్ఞప్తి

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ప్రధాన ద్వారాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. రక్షణ చర్యల్లో భాగంగా విమ్స్ లోపల ఓపీ, కాజువాలిటీ, పరిపాలనా విభాగం తదితర చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉంది. ప్రధాన ద్వారాల వద్ద మాత్రం వాటి విషయం మరిచిపోయారు. జాతీయ రహదారి వైపు ఒక ప్రధాన ద్వారం, బీఆర్‌టీఎస్ వైపు మరో ప్రధాన ద్వారం ఉన్నాయి. ఈ రెండు ద్వారాల వద్ద సీసీ కెమెరాలు అవసరం. ఇటీవల కోల్‌కతాలో జరిగిన సంఘటనతో ఆస్పత్రుల్లో పటిష్టమైన రక్షణ చర్యలు అవసమని వైద్య నిపుణులు కోరుతున్న విషయం తెలిసిందే. ఆస్పత్రుల్లో అన్ని చోట్లా రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలకు సూచిస్తున్నారు. విమ్స్‌లో పలుసార్లు రాత్రి వేళ బయట నుంచి వచ్చిన వ్యక్తులు గొడవలు చేసిన సంఘటనలు జరిగాయి. ఐదు నెలల కిందట ఓ యువకుడు కత్తితో లోపలకు ప్రవేశించి నర్సింగ్ సిబ్బందిపై దాడి చేసి, హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. ఆ యువకుడు బీఆర్‌టీఎస్ ద్వారం నుంచి కత్తి పట్టుకొని లోపలకు ప్రవేశించాడు. సీసీ కెమెరాలు ఉండి ఉంటే వెంటనే గుర్తించి అలాంటి వారిని లోపలకు ప్రవేశించకుండా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడానికి వీలుపడుతుందని రోగులు, విమ్స్ సిబ్బంది కోరుతున్నారు.



జాతీయ రహదారి వైపు సీసీ కెమెరాలు లేని విమ్స్ ప్రధాన ద్వారం

గెడ్డల శుభ్రతలో నిర్లక్ష్యం వద్దు

- జోన్–3 ప్రత్యేకాధికారి కీర్తి
- 16వ వార్డులో విస్తృత పర్యటన

సాక్షి ఎఫెక్ట్..

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులో ఆదివారం జీవీఎంపీ ప్రత్యేకాధికారి, వీఎంఆర్‌డీఏ కార్యదర్శి డి.కీర్తి విస్తృతంగా పర్యటించారు. ఈ వార్డులోని పలు గెడ్డలు పూడికలతో నిండిపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై గత నెల 29న 'గెడ్డలు ఘోరం' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆమె ఇసుకతోట గెడ్డను పరిశీలించారు. పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించకపోడం వల్ల ఏర్పడిన పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గెడ్డలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న పూడికలను సకాలంలో తొలగించకపోవడంతో పారిశుధ్య సిబ్బంది తీరుపై మండిపడ్డారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, కాలువలు, గెడ్డలను ప్రత్యేకాధికారి పరిశీలించారు. వాటికి సకాలంలో మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను సూచించారు. వార్డులోని హెచ్‌బీ కాలనీ, రజక వీధి, అంబేడ్కర్ కాలనీ మీదుగా ప్రవహిస్తున్న ప్రధాన గెడ్డలో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. కేఆర్ఎం కాలనీ, ఆక్సిజన్ టవర్స్, సీతమ్మధార రైతుబజారు వెనుక గల ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రతలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, తహసీల్దార్ ఎస్.రమేష్, ఏఎంహెచ్‌వో దుర్గాప్రసాద్, ఆర్ఐ ఇబ్రహీం, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుకతోటలో గెడ్డను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కీర్తి

గుడ్లవల్లేరు కాలేజీ ఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

బీచ్‌రోడ్డు: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలోని విద్యార్థినుల హాస్టల్ బాత్‌రూమ్‌ల్లో రహస్య కెమెరాలు ఏర్పాటు చేయడంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 300 మంది విద్యార్థినుల వీడియోలు చిత్రీకరించారని, అవి సోషల్ మీడియాలో ప్రచురించారని చెబుతున్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల్లో హిడెన్ కెమెరాలపై తనిఖీలు చేయాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఫుడ్ పాయిజన్ వల్ల 60 మంది ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థుల అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన నేపథ్యంలో.. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ ప్రయాణం ప్రమాదకరం

- బస్సుల్లో ఫుట్‌పాత్‌పై వేలాడుతూ పయనిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: ఆర్టీసీ సిటీ బస్‌లో ప్రయాణం చాలా సుఖంగా ఉంటుంది. అదే బస్‌లో వేలాడి ఫుట్‌పాత్‌పై ప్రయాణించడమే ప్రమాదమవుతుంది. విద్యార్థులు రోజూ ఉదయం, సాయంత్రం కళాశాలలకు వెళ్లి వస్తున్న సమయంలో ఇదే విధంగా ఫుట్‌పాత్ ప్రయాణం చేస్తున్నారు. ఆరిలోవ నుంచి కళాశాలలకు వెళ్లి వస్తున్న విద్యార్థులు సిటీ బస్‌ల్లో ఎక్కువగా ఫుట్‌పాత్‌లపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. రన్నింగ్‌లో బస్‌లు ఎక్కడం, దిగడం చేస్తున్నారు. బస్ లోపల కూర్చోవడానికి సీట్లు ఉన్నప్పటికీ, లేదంటే నిలబడేందుకు లోపల ఖాళీ ఉన్నప్పటికీ వాటిని కాదని ఫుట్‌పాత్ ప్రయాణానికే ఆసక్తి చూపుతున్నారు. ఇలా ప్రయాణించడం ప్రమాదని తెలిసినా వారు పట్టించుకోవడం లేదు. చాలాసార్లు పలువురు విద్యార్థులు ఫుట్‌పాత్‌పై నుంచి జారిపడి గాయాలపాలైన సంఘటనలు జరిగాయి. విద్యార్థులూ ఇకనైనా ఆ ప్రయాణం మానండి, జాగ్రతగా ప్రయాణించండి అంటూ ఆర్టీసీ డ్రైవర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



చినగదిలి కూడలి మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్‌లో వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు

సంగీతం.. విశ్వవ్యాప్తం



తోలుబొమ్మలాట ప్రదర్శన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎం.ఎస్ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు

మద్దిలపాలెం: పారా... ద సుప్రీమ్ 7వ వార్షికోత్సవం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు కళాభారతి ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగీతం విశ్వవ్యాప్తమని, సంగీత విద్వాంసురాలు డాక్టర్ పంతుల రమ స్థాపించిన ఈ సామాజిక, సాంస్కృతిక చైతన్య గీతిక ఏడేళ్లుగా ఎన్నో కార్యక్రమాల ద్వారా ప్రజల్లో సంగీతంపై అవగాహన, ఆసక్తిని కల్పిస్తున్నాయన్నారు. గతంలో స్వచ్ఛస్వర, స్వర 2 రాగ, స్పందన వంటి వినూత్న కార్యక్రమాలతోపాటు సంగీతానికి సంబంధించిన ఎన్నో ముఖ్య అంశాలపై శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

అలరించిన తోలుబొమ్మలాట

వేడుకల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర తోలుబొమ్మలాట బృందం ప్రదర్శించిన రామాయణంలోని మైరావణ చరిత్ర కథ ఘట్టం అందరినీ అలరించింది. తోలుబొమ్మలాటలో సంగీతంపై పరస్పర చర్చ రసవత్తరంగా సాగింది. అనంతరం నిర్వహించిన కృతి సమీక్షలో సంగీత విద్యార్థులు, రసజ్ఞులు కర్ణాటక సంగీత రచనల్లోని సంగీతం, సాహిత్యంపై విశ్లేషణాత్మక ప్రదర్శనలు చేశారు. వీరంతా బరంపూర్, ఢిల్లీ, గోరక్‌పూర్ ప్రాంతాల నుంచి రావడం విశేషం. సమీక్షలో పాల్గొన్న వారిని పంతుల రమ, పంతుల గోపాలరావులు ప్రశంసించారు. సంగీత విద్వాంసులు, సంగీత సుధానిధి గురువిల్లి అప్పన్న నాదస్వర కచేరీతో వేడుకలు ముగిశాయి. కంచి కామకోటి పీఠ ఆస్థాన విద్వాంసుడు గురువిల్లి దుర్గారావు డోలుపై సహకరించారు. ఎంతో శ్రావ్యమైన, ఆనందభరితమైన నాదస్వర–డోలు కచేరీ రసజ్ఞులను మంత్రముగ్ధులను చేసింది.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అల్లర్లు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. మీపై పోలీస్ నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పడకేసిన ప్రజారోగ్యం

మద్దిలపాలెం: రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ గాడి తప్పిందని, ఎక్కడ చూసినా విషజ్వరాలు, వ్యాధులతో ప్రజలు అల్లాడుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజారోగ్యం పడకేయడంతో ప్రజలు నాణ్యమైన వైద్యం అందక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా సతమతమవుతున్నారన్నారు. ఎక్కడికక్కడ పారిశుధ్య లోపం ఉండటంతో దోమల ఉధృతి పెరిగి స్థానిక ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయని, వీటిని కట్టడి చేయడంలో వైద్య ఆరోగ్య శాఖ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తనకేం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందకపోవడంతో ప్రజలు ప్రైవేటు హాస్పిటళ్లలో చేరి అప్పుల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రజలు రోగాలతో అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గాఢనిద్రలోంచి మేల్కొని, పేదల జీవితాలకు భరోసా కల్పించాలని వెంకటరావు కోరారు.

సినీ పరిశ్రమ విశాఖ తరలి రావాలి



కంచర్ల అచ్యుతరావును సత్కరిస్తున్న ఫెడరేషన్ సభ్యులు

డాబాగార్డెన్స్: ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్‌గా కంచర్ల అచ్యుతరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో సినీ నిర్మాత, ఉపకార్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు, ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితుడైన కంచర్లను ఫెడరేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినా ఇంకా తెలుగు పరిశ్రమ తెలంగాణకే పరిమితమై పోయిందన్నారు. సినీ పరిశ్రమ విశాఖకు తరలి రావాలని, ఇక్కడ ఫిల్మ్ చాంబర్ ఏర్పాటు చేయాలని కోరారు. సెన్సార్ బోర్డును కూడా ఇక్కడే నెలకొల్పాలన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలమైన పర్యాటక ప్రదేశాలను తెలిపారు. ముఖ్యంగా విశాఖ అందాల కోసం దర్శక, నిర్మాతలు ముందుకు వస్తున్నారని కంచర్ల పేర్కొన్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు తోరం రాజా, ప్రధాన కార్యదర్శి అచ్యుతరామస్వామి, చెన్నా తిరుమలరావు, రాజేంద్ర ప్రసాద్, లక్ష్మీ స్వరూప తదితరులు పాల్గొన్నారు.